

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



రాజేష్‌ను అభినందిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొనకొండ్ల రాజేష్ నియమితులయ్యారు. తాజా మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు సహా పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయనను అభినందించారు. సామాన్య కార్యకర్తలకు బీజేపీ పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా సందిరెడ్డి అన్నారు. రెండు పర్యాయాలు తాను జిల్లా అధ్యక్షుడిగా అనేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు దగ్గరయ్యేందుకు కార్యకర్తలే వారధులుగా నిలిచారని అన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కొత్త అధ్యక్షుడికి సూచించారు. అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు చిరంజీవిరెడ్డి, పార్థసారథి, కిరణ్ గౌడ్, అశోక్‌రెడ్డి, రత్నమయ్య, ప్రతాప్ రెడ్డి, లలిత్‌కుమార్, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి తదితరులు ఆయనను అభినందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులుగా ఇప్పటివరకూ ఓసీలకే అవకాశం లభించింది. తాలంకి కృష్ణమూర్తి, పుండరీకాక్ష రెడ్డి, పార్థసారథి, విష్ణువర్ధన్ రెడ్డి, అంకాల్ రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు ఇలా... అందరూ ఓసీలే అధ్యక్షులయ్యారు.

డీఆర్వోను డిస్మిస్ చేయాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- దళిత సంఘాల డిమాండ్
- జేసీకి ఫిర్యాదు



జేసీ శివనారాయణ శర్మకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డీఆర్వో మలోలను డిస్మిస్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు తదితరులు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసంరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ సమక్షంలోనే ఆయన ఆన్‌లైన్ రమ్మీ ఆడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. డీఆర్వో మలోల రమ్మీ ఆడుతున్న విషయం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో వారు స్పందించారు. దళితులంటే గిట్టని డీఆర్వో, సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ పేకాట ఆడటం క్షమించరానిదని అన్నారు. ఆయనను డిస్మిస్ చేయాలని జేసీకి ఫిర్యాదు చేస్తే, కమిటీ వేసి విచారిస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కేశవ, ఆది, లక్ష్మయ్య, వెంకటేష్, చంటి, రమేష్, నారాయణస్వామి, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

దురహంకారానికి నిదర్శనం

బాధ్యతగా పనిచేయాల్సిన ఉన్నతాధికారి ఏకసభ్య కమిషన్ సమక్షంలో సెల్‌ఫోన్‌లో రమ్మీ ఆడటం ఆయన దురహంకారానికి నిదర్శనమని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మండిపడ్డారు. మనువాద భావదారిద్ర్యం కొనసాగుతోందనడానికి ఈ ఘటన నిదర్శనమని అన్నారు. భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు, మానవీయ సమాజానికి ఇది గొడ్డలి పెట్టులాంటిదని అన్నారు. డీఆర్వో మలోలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం	32.0
కనిష్ఠం	16.0

హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు



అదనంగా 0.92 టీఎంసీలు

- 32.354 టీఎంసీలకు పెరిగిన వాటా
- ఐదేళ్లలో గరిష్ఠ కేటాయింపులు ఇవే
- అయినా... కొనసాగుతున్న నీటి వృథా
- ఆ పనులు పూర్తి చేస్తే పరిస్థితి మెరుగు

హెచ్చెల్సీ గలగల

ఐదేళ్ల తరువాత హెచ్చెల్సీ వాటా నీరు గరిష్ఠ స్థాయి కేటాయింపులు జరిగాయి. ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలు, ఆయకట్టు పంటలకు సరిపడా నీరు తుంగభద్ర డ్యాం నుంచి ఇస్తున్నారు. ఈ ఏడాది డ్యాంలో నీటి లభ్యత ఆధారంగా 32.354 టీఎంసీలను కేటాయించారు. ఇందులో రెండు రోజుల క్రితం ప్రకటించిన 0.92 టీఎంసీల నీరు కూడా ఉంది. కానీ హెచ్చెల్సీ దెబ్బతిన్న కారణంగా నీటి సరఫరా, వినియోగంలో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. సరిహద్దుకు చేరేలోగా సుమారు 4 టీఎంసీలు, జిల్లా పరిధిలో కాలువలు దెబ్బతిన్న కారణంగా మరింత నీరు వృథా అవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రూ.36 కోట్ల నిధులను కేటాయించింది. ప్రభుత్వం సూచించిన ప్రాధాన్య పనులను పూర్తి చేస్తే, వచ్చే సీజన్‌లో అయినా జిల్లా ప్రజలకు మేలు జరుగుతుంది.

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత పెరగడంతో హెచ్చెల్సీకి అదనంగా 0.92 టీఎంసీల నీటిని కేటాయించారు. హెచ్చెల్సీ అధికారిక వాటా 32 టీఎంసీలు కాగా, ఈ ఏడాది పూర్తిస్థాయిలో నీటిని తీసుకునే వెసులుబాటు కలిగింది. టీబీ డ్యాంలో నీటి లభ్యత ఆధారంగా మొదట 28 టీఎంసీలు కేటాయించారు. ఆ తరువాత 29.434 టీఎంసీలకు పెంచారు. ఈ నీటి సంవత్సరంలో టీబీ డ్యాం నీటి లభ్యతను 198 టీఎంసీలుగా నిర్ధారించారు. దీని ఆధారంగా హెచ్చెల్సీకి అదనంగా 0.92 టీఎంసీలు కేటాయించారు. కేసీ కెనాల్ డైవర్షన్ కింద హెచ్చెల్సీకి మరో 2 టీఎంసీల కేటాయింపులు ఉన్నందున.. మొత్తం 32.354 టీఎంసీలు కేటాయించినట్లు అయింది. గడిచిన ఐదేళ్లలో హెచ్చెల్సీకి కేటాయించిన నీటిలో ఇదే గరిష్ఠం. ఇప్పటి వరకు డ్యాం నుంచి 30.995 టీఎంసీల నీటిని విడుదల చేశారు. జిల్లా సరిహద్దుకు 27.115 టీఎంసీల నీరు చేరింది. మరో 1.3 టీఎంసీల నీరు మాత్రమే రావాల్సి ఉంది.

ఈ పనులు పూర్తి అయితే..

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీ కింద అత్యంత ప్రాధాన్యం కింద సూచించిన 11 పనులను పూర్తి చేస్తే నీటి వృథాను దాదాపుగా అరికట్టే అవకాశం ఉంది. ఈ పనులకు రూ.36 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవ 165.028 కిలోమీటరు వద్ద సగం పూర్తి అయిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59 కోట్లు కేటాయించారు. 169.400 కి.మీ. వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91 కోట్లు మంజూరు చేశారు. 155.81 కి.మీ. వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53 కోట్లు, 115.16 కి.మీ. వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66 కోట్లు కేటాయించారు. 117.794 కి.మీ. వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395 కి.మీ. వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్ ఫాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21 కోట్లు కేటాయించారు. 137.702 కి.మీ. వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21 కోట్లు మంజూరు చేశారు. 189.126 కి.మీ. వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్నిర్మాణానికి రూ.4.10 కోట్లు కేటాయించారు. 189.126 కి.మీ. వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ, మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కి.మీ. నుంచి 130 కి.మీ. వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80 కోట్లు కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటరు వద్ద ఆఫ్ టేక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22 లక్షలు కేటాయించారు.

3.885 టీఎంసీల వృథా

హెచ్చెల్సీ నీటి వృథా కొనసాగుతోంది. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీ విడుదలయ్యే 32 టీఎంసీలలో సుమారు నాలుగు టీఎంసీల నీరు వృథాగా చూపిస్తున్నారు. టీబీ డ్యాం నుంచి 30.995 టీఎంసీల నీటిని విడుదల చేయగా.. సరిహద్దు 105 కిలోమీటరు పాయింట్‌కు 27.115 టీఎంసీల నీరు చేరింది. మిగిలిన నీరు ఏమైందనే ప్రశ్నకు సమాధానం లేదు. ఇంత భారీ స్థాయిలో నీటి వృథా కొనసాగుతున్నా.. ప్రశ్నించేవారు లేకుండాపోయారు. వృథా పోనూ, సరిహద్దుకు చేరిన నీరు కూడా వందశాతం వినియోగంలోకి రావడం లేదు. సాగు, తాగునీటి అవసరాలకు తరలించే క్రమంలో భారీగా వృథా అవుతోంది. హెచ్చెల్సీ శిథిలావస్థకు చేరడమే దీనికి కారణం.

ఏడు నెలల్లో పూర్తి చేస్తాం..



ప్రభుత్వం గుర్తించిన 11 పనులను పూర్తి చేస్తే నీటి వృథాను కొంత మేర అరికట్టవచ్చు. నీటి సరఫరా ఆగిన వెంటనే ఆ పనులను ప్రారంభిస్తాం. ఏడు నెలల్లో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాము. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. అగ్రిమెంట్లు పూర్తి చేసి, ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది టీబీ డ్యాం నుంచి నీరు విడుదల అయ్యేలోపు పనులు పూర్తి చేస్తాం.

- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్‌ఈ



కణేకల్లులో నాటేందుకు సిద్ధంగా ఉన్న వరినారు

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలను నియంత్రిస్తాం



జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదన

డీజీపీ ద్వారకా తిరుమలరావు

- వివరాలు 7లో...

వరించేలా

పలు ప్రాంతాల్లో జోరుగా వరిసాగు 6



నేడు డాకు మహారాజ్ విజయోత్సవ సభ



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమా విజయోత్సవ సభ బుధవారం నిర్వహించనున్నారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో సాయంత్రం 6.30 గంటలకు ఈవెంట్ ప్రారంభంకానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలోనే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జిల్లా కేంద్రంలో నిర్వహించాలని భావించి, అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే తిరుమలలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో ఈవెంట్‌ను రద్దు చేసిన విషయం తెలిసిందే.

ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

విజయోత్సవ సభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌లతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి మంగళవారం పరిశీలించారు. అనంతరం డాకు మహారాజ్ ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ కార్యక్రమ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టార న్నారు. అభిమానులు సంయమనం పాటించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రజకుల అభివృద్ధికి సహకరించాలి

- రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ సావిత్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ సావిత్రి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రజకుల జీవనోపాధుల పెంపు, అభివృద్ధికి సహకారమందించాలని రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ సావిత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆమె జిల్లాలోని అనంతపురం, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. పలువురు రజకుల ద్వారా వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికసాయం కావాలని, శిథిలమైన దోబీఘాట్లను నిర్మించాలని, యువతకు ఉపాధి చూపాలంటూ పలువురు రజకులు తన దృష్టికి సమస్యలను తీసుకొచ్చారన్నారు. గతంలో రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక వెల్ఫేర్ కమిటీ ఉండేదన్నారు. ఇప్పుడు ఆ కమిటీ పనిచేయకపోవడం వల్ల రజకుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జీవో నెం.6 ప్రకారం వెల్ఫేర్ కమిటీలో రజక కులానికి చెందిన నగులురు సభ్యులు, ఒక మహిళ ఉండేవారన్నారు. ఒక రెవెన్యూ డివిజన్‌కు ఒక సభ్యుడు, చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ ఉండేలా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఆ క్రమంలోనే గతంలో కమిటీ సమావేశాల్లో చర్చించి రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారన్నారు. త్వరలోనే జీవో నెం.6 ప్రకారం రెండు జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపాల్టీ, పంచాయతీ స్థలాల్లో నిర్మించిన షాపులలో రజకులు లాండ్రీ పెట్టుకోవడానికి 5 శాతం షాపుల కేటాయింపు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. మోడ్రన్ దోబీ ఘాట్‌లు ఏర్పాటు చేసి యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ డైరెక్టర్ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల పర్యవేక్షణ గాలికి..!

6 నుంచి ఇంటర్ వరకూ తరగతులు

32 కేజీబీవీల్లో 8,420 మంది విద్యార్థులు

- సెక్టోరియల్ పోస్టులు ఖాళీ
- అటకెక్కిన తనిఖీలు, సమీక్షలు
- త్వరలో పది, ఇంటర్ పరీక్షలు
- కొత్త ఏపీసీ శైలజకు అన్నీ సవాళ్లే

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను జిల్లా విద్యాశాఖాధికారులు గాలికి వదిలేశారు. పర్యవేక్షణ పూర్తిగా విస్మరించారు. ప్రాజెక్టుకు గత కొంతకాలంగా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. ఇక 32 కేజీబీవీలను పర్యవేక్షణ చేసే గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ) పోస్టుకు రెగ్యులర్ లేకపోవడంతో ఇన్‌చార్జితోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆమె కూడా చుట్టపు చూపుగా కేజీబీవీలకు వెళుతుండడంతో ఫలితం లేకుండా పోతోంది. త్వరలో పది, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటి వరకూ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష చేయలేదంటే.. కేజీబీవీల్లో పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలిసిపోతోంది. కేజీబీవీలను తరచూ తనిఖీలు చేసే సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియియల్ పోస్టులు కూడా ఖాళీగా ఉండడంతో అటువైపు వెళ్లే నాథుడే కరువయ్యారు. కొత్తగా ఏపీసీగా నియమితులైన శైలజకు ఇలాంటి సమస్యలు సవాలుగా నిలుస్తున్నాయి.

తనిఖీలు తూచ్..

జిల్లా వ్యాప్తంగా 32 కేజీబీవీలు ఉన్నాయి. వీటి పరిధిలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ బోధన అందిస్తున్నారు. విద్యార్థులకు వసతితో కూడిన బోధన అందిస్తున్నారు. తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున అడ్మిషన్లు ఇస్తారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ అంటే 200 మంది విద్యార్థులు ప్రతి కేజీబీవీలో తప్పనిసరిగా ఉంటారు. ఇంటర్ మొదటి, రెండో ఏడాది అడ్మిషన్లు కూడా ఉండటంతో ఒక్కో కేజీబీవీలో ఒక్కో రకమైన కోర్సు అందిస్తుండటంతో...విద్యార్థుల సంఖ్యలో అటు ఇటుగా వ్యత్యాసం కనిపిస్తుంది. 6 నుంచి ఇంటర్ వరకూ విద్యార్థులు రమారమి ఒక్కో కేజీబీవీలో 230 నుంచి 250 మంది, 277 మంది ఇలా ఒక్కోచోట ఒక్కోరకంగా ఉన్నారు. సమగ్రశిక్ష అధికారిక గణాంకాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో కలిపి 8,420 మంది చదువుతున్నారు. గతంలో ప్రతి విద్యార్థినికి నెలకు రూ. 1,400 వ్యయం చేస్తుండగా....కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ. 1600కు పెంచింది. జనవరి నెల నుంచి ఈ మొత్తాన్ని అందించేలా ఉత్తర్వులు జారీ చేశారు. చాలా కేజీబీవీల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కొందరు ప్రిన్సిపాళ్ల ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో అల్పాహారం, భోజనంలో నాణ్యత లోపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. చాలా కేజీబీవీల్లో సిబ్బంది మధ్య గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో కేజీబీవీలపై నిరంతర పర్యవేక్షణ చేస్తే గానీ సమస్యలు కొలిక్కి వచ్చేలా లేవు.

పరీక్షలపై సమీక్షలేవీ...?

త్వరలో పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు దగ్గర పడగానే... విద్యార్థుల ప్రిపరేషన్, ప్రొగ్రెస్‌పై సమీక్షలు నిర్వహించేవారు. గతంలో కేజీబీవీల్లో డీఈఓ, ఏపీసీ, జీసీడీఓలు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు తనిఖీలు చేసేవారు. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి వరకూ కేజీబీవీలకు వెళ్లి స్టడీ అవర్స్ ఎలా సాగుతున్నాయో కూడా పరిశీలించే వారు. గత కొంతకాలంగా ఏపీసీ, సెక్టోరియల్ అధికారులు లేకపోవడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. కొత్త ఏపీసీ వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

విద్యార్థుల వివరాలు ఇలా....

తరగతి	విద్యార్థుల సంఖ్య
6వ తరగతి	1288
7వ తరగతి	1296
8వ తరగతి	1292
9వ తరగతి	1275
10వ తరగతి	1223
ఇంటర్ ప్రథమ	1103
ఇంటర్ ద్వితీయ	943
మొత్తం	8,420



శిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్/రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమమైన ఉపాధి ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయి స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు జిల్లాలో గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాల గురించి పీపీటీ ద్వారా వివరించారు. భవిష్యత్తు కార్యక్రమాలపై కమిటీ సభ్యులు వారి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంకల్ప, పీఎం విశ్వకర్మ, డీఎస్సీ తదితర వాటిపై చర్చించి, జిల్లాలో చేపట్టాల్సిన నైపుణ్య కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, సభ్యులకు సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ సామర్థ్యం పెంచేలా చూడాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలపై కార్యచరణ ప్రణాళికలు రూపొందించుకుని ఎక్కువమందికి శిక్షణ ఇచ్చేటట్లు చూడాలన్నారు. దీనికి సంబంధించి నివేదికలు తయారు చేయాలని, శిక్షణ ఇచ్చిన తరువాత వారికి కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పించేలా జాబ్‌మేళా నిర్వహణకు కృషి చేయాలన్నారు. ప్రతినెలా జాబ్ మేళా నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. డీఎస్సీ సభ్యులందరికీ మెరుగైన కమ్యూనికేషన్ కోసం వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు. కియ సంస్థ ద్వారా 1900మందికి శిక్షణ ఇస్తున్నామని, ప్రతినెల దాదాపుగా 240మంది వరకు శిక్షణ పూర్తి చేసుకుని వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశం పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, జిల్లాఉపాధి కల్పన అధికారి కళ్యాణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్, డీటీడబ్ల్యుఓ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

RAYADURG MUNICIPALITY

e-procurement - Tender Notice

Tender Notice No.38/234/2024/E1 to 47/234/2024/E1, **Date:21-01-2025**

Name of scheme	General Funds & ASC Grant
No.of Works	10 Nos
Total Estimated Amount	36.74 Lakhs
Bid Document download starting date	21-12-2024 @10.00 AM
Name and Address of Concerned Officer	Municipal Commisioner Rayadurg Municipality, Cell:9849905858

Further details can be seen on e-procurement market place i.e., www.tender.aperpocurement.gov.in

Sd/- Commissioner
Rayadurg Municipality.

చెస్ చాంపియన్.. స్టీఫెన్



బహుమతి అందుకుంటున్న శామ్యూల్ స్టీఫెన్‌నోబుల్

జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఆంధ్రాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కాకినాడలో నిర్వహిస్తున్న నేషనల్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ముగిశాయి. 28 రాష్ట్రాల నుంచి సుమారు 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 9మ్యాచ్‌లు ఆడి 7 మ్యాచ్‌లో గెలుపొంది ఈ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహుమతి అందుకున్నాడు. విజేతను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, కోచ్ హుస్సేన్‌ఖాన్‌లు అభినందించారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొనే జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు మంగళవారం అనంతపురంలో నిర్వహించారు. ఎంపికైనవారి వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బాలికల విభాగంలో వందన, మాన్విత, తరుణిక, రక్ష, జస్మిత, షణ్ముఖసాయిప్రియ ఎంపికయ్యారు. బాలుర విభాగంలో పవన్ కేశవరెడ్డి, యజ్ఞరూప్ యాదవ్, గురువర్ధన్, మహ్మద్ ఆయాన్, సాయి, జయదీప్‌సాయి, దాదా సలామాన్‌లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 23 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. **- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్**

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

అనంతలో 14, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 కేటాయింపు

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ప్రైవేటు మద్యం దుకాణాలను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 9 ప్రైవేటు మద్యం దుకాణాలను ఈడిగ, గౌడ వర్గాలకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారికంగా సమాచారం అందింది. దరఖాస్తు ఫీజు (నాన్‌రిఫండబుల్) రూ.2లక్షలుగా నిర్ణయించారు. అయితే లైసెన్స్ ఫీజు విషయంలో ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఒక్కో దుకాణానికి 50 శాతం మాత్రమే లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 7న లాటరీ తీయాలని నిర్ణయించారు.

ఏఐటీయూసీ జిల్లా వర్క్‌షాప్

వచ్చే నెల 22 నుంచి నిర్వహణ

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 22 నుంచి ఏఐటీయూసీ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో వర్క్‌షాప్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఉద్యోగ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నా యన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించడం మానేసి అవుట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నార న్నారు. 20 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమస్యలపై కార్మికుల్లో అవగాహన తేవడానికి, చైతన్యం నింపడానికి వర్క్‌షాప్ పెట్టినట్లు తెలిపారు. వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి, ఇతర నాయకులు రాజు, బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నీరుంటే చాలు పుడమి కడుపున రైతులు బంగారం పండిస్తారు. సేద్యంలో తరిస్తూ జీవజాతికి కడుపునింపుతారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులంతా పంటల సాగులో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల ట్రాక్టర్లతో వరిమడిని సిద్ధం చేస్తుండగా, కూలీలు నాట్లు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల వేరుశనగ సాగు చేస్తున్నారు. ముఖ్యంగా నాలుగేళ్ల తర్వాత బీటీపీకి నీరు రావడంతో చివరి ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు సరిపడా నీరు ఉండటంతో రైతులు వరి సాగులో బిజీబిజీగా ఉన్నారు.



వరించేలా

పలు ప్రాంతాల్లో జోరుగా వరిసాగు

- సేద్యం చేస్తూ.. నాట్లు వేస్తున్నరైతులు
- చివరి ఆయకట్టుకు నీరు వస్తుందన్న ఆశాభావం
- నీటితో కళకళలాడుతున్న రిజర్వాయర్లు, చెరువులు
- ఉత్సాహంగా సేద్యం పనుల్లో అన్నదాతలు

కణేకల్లు చెరువు కింద రెండో పంట సాగు

● ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ● రెండో పంటగా వరి

కణేకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు కింద రెండో పంటగా వరిని సాగు చేస్తున్నారు. కణేకల్లుతో పాటు గంగులాపురం, రచ్చుమర్రి తదితర ప్రాంతాల రైతులు వరి సాగును ప్రారంభించారు. ఈ చెరువు కింద రబీసీజన్‌లో దాదాపు మూడు వేల ఎకరాలలో వరిపంటను సాగుచేస్తున్నారు. గతంలో రెండోపంటకు నీటి సమస్యలు ఏర్పడేవి. కానీ ఈ ఏడాది కణేకల్లు చెరువులో పుష్కలం గా నీరు ఉండటంతో రైతులంతా ఉత్సాహంగా పంటసాగుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తాను గెలిచి, కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే కణేకల్లు చెరువు కింద రెండో పంటకు కూడా నీరు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తుంగభద్ర డ్యాంలోకి నీటిరాక ప్రారంభమైనప్పటి నుంచి హెచ్చెల్సీ అధికారులతో ముందస్తు ప్రణాళికలు చే యించి రెండో పంటకు అవసరమైన నీటిని కణేకల్లు చెరువులో నిల్వ ఉంచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు కూడా రెండోపంటకు సమాయత్తం అవుతూ ఇప్పటికే నాట్లు కూడా వేసుకుంటున్నారు.


కణేకల్లు చెరువు

సంతోషంగా ఉంది



రెండో పంటకు మా భూముల్లోకి సాగునీరు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇటీవలే మాకున్న 1.5 ఎకరాల పొలంలో పండించిన ధాన్యాన్ని విక్రయించాం. వెంటనే రెండో పంటకు కూడా నీరు అందుబాటులో ఉండటంతో పంటసాగుకు సమాయత్తం అవుతున్నాం.
- రవి, రైతు, గంగలాపురం

రైతులందరికీ ఉపయోగం



ఈ ప్రాంతంలో వరిపంటే ప్రముఖంగా పండిస్తున్నాం. నాకు 70 సెంట్ల భూమి మాత్రమే ఉంది. అయితే ఏడాదిలో రెండు పంటలు సాగు చేసే అవకాశం రావడంతో ఇతర పనులకు వెళ్లకుండా వ్యవసాయాన్ని నమ్ముకుని గౌరవంగా జీవించే అవకాశం ఏర్పడింది. **- ఖాసీం, రైతు, కణేకల్లు**




శింగనమల ఆయకట్టు భూముల్లో సేద్యం పనులు చేస్తున్న రైతులు

2 వేల ఎకరాల్లో...

శింగనమల: శింగనమల శ్రీరంగరాయ చెరువు ఆయకట్టులో రెండు వేల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈచెరువు కింద అధికారికంగా 2500 ఎకరాలు, అనధికారికంగా మరో 2500 ఎకరాల భూములు ఆయకట్టుగా సాగవుతున్నాయి. అయితే గత పదేళ్లలో ఇలా ఎక్కువ స్థాయిలో ఆయకట్టును సాగు చేసిన పరిస్థితి లేదు. బోరుబావుల కింద మరో 1500 ఎకరాల్లో కూడా వరి సాగుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. నీరు వృథా చేయకుండా వాడుకుంటే చివరి ఆయకట్టు కూడా సస్యశ్యామలం అవుతుందని రైతులు చెబుతున్నారు. లేకుంటే చివరి ఆయకట్టు భూములు ఉన్న సోదనపల్లి, పోతురాజుకాల్వ, చక్రాయపేట గ్రామాలకు నీరు వెళ్లడం కష్టమవుతుంది.

నీరు సరిపోతుంది


వరినాట్ల కోసం మడిని సిద్ధం చేస్తున్నరైతు

చెరువులో పంట సాగుకు అవసరమైన నీరు ఉంది. నీరు సరిపోతుందనే నమ్మకంతోనే పంటలు సాగు చేస్తున్నాం. ఒకవేళ పంట చివరి దశలో నీరు తక్కువ వస్తే ఎమ్మెల్యే విడుదల చేయిస్తారనే నమ్మకం ఉంది.
- మాసూద్‌వలి(మోదు), రైతు, శింగనమల



దేవుడి మీద భారమేసి..



చెరువులో నీరు నిండుగా ఉంది. అందుకే దేవుడిపై భారం వేసి పంట సాగు చేస్తున్నాం. పంటలకు సాగు నీటి సమస్య రాదనే అనుకుంటున్నాం. భూమి తల్లి రైతులను ఎప్పుడూ మోసం చేయదు. దిగుబడి కూడా బాగా వస్తుందని నమ్మకంగా సాగు చేస్తున్నాం.
- తిరుపాలు, రైతు, శింగనమల


యర్రంపల్లి వద్ద ఆయకట్టులో వేరుశనగ సాగు

4 ఏళ్ల తర్వాత..

గుమ్మఘట్ట: నాలుగేళ్ల తర్వాత బీటీపీకి పూర్తి స్థాయిలో నీరు చేరడంతో ఎడమ కాలువ కింద 3500 ఎకరాలు, కుడికాలువ కింద 2600 ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతులు పంటల సాగులో బిజీబిజీగా కనిపిస్తున్నారు. రంగచేడు, ఎర్రంపల్లి, నేత్రపల్లి గ్రామాల పరిధిలో పదిరోజులుగా వరి, వేరుశనగ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. డిసెంబరు చివరిలో సాగునీరు విడుదల కావడంతో ముందస్తుగా బోర్ల కింద నార్లు పోసుకొని ప్రస్తుతం కొంత మంది రైతులు నాట్లు వేసుకుంటుండగా మరికొంతమంది వేరుశనగ సాగు చేస్తున్నారు. మిగతా భూములను సాగుకు సిద్ధం చేసుకుని నార్లు పోసుకుంటున్నారు. 15వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 17వ డిస్ట్రిబ్యూటరీ వరకు చివరి ఆయకట్టుకు నేరుగా సాగునీరు అందిస్తుండటంతో రైతులు పంటల సాగుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది - ఆంజనేయులు, రైతు, రంగచేడు



నాలుగేళ్లుగా చివరి ఆయకట్టు భూములు నీళ్ల లేక బీళ్లుగా ఉండేవి. ప్రస్తుతం నీరు సమృద్ధిగా విడుదల చేస్తుండటంతో పచ్చ ని చేలుగా మారుతున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు కూడా పంటలు పండించుకునే అవకాశం దొరకడం ఆనందంగా ఉంది.

బోరుబావుల్లో పుష్కలంగా నీరు: కంబరి మారెన్న, రైతు, రంగచేడు



బీటీపీ కాలువ నీరు ఆయకట్టుకు పారుతుండటంతో మా పొలాల్లోని బోరుబావులు రీచార్జ్ అవుతున్నాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. అందుకే ముందస్తుగానే వరినారు పోసుకొని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యాం. మరో మూడేళ్ల పాటు బోరుబావుల్లో పుష్కలంగా నీరు వస్తాయి.


చొరబడి

పాఠశాల కబ్జా

పశువుల పాకగా మార్చేసిన వైసీపీ నాయకులు









పాఠశాల ప్రధాన దారికి ముళ్ల కంపలు అడ్డుగా వేసిన వైసీపీ నాయకులు

పాఠశాలలో పశువులను కట్టేసిన వైసీపీ నాయకులు

గ్రామ కంఠం అంటూ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్(స్కెచ్)

విడపనకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల ఆగడాలు, ఆక్రమణలు ఇప్పటికీ ఆగటంలేదు. ఉండబండ గ్రామంలో ఇద్దరు వైసీపీ నాయకులు వినియోగంలో లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆక్రమించుకున్నారు. అందులో తమ పశువులను, గొర్రెలను, వ్యవసాయ పనిముట్లను ఉంచుతున్నారు. గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థులు ఎక్కువ కావ టంతో దాన్ని ఎంపీయూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 2012 నుంచే ఎంపీ యూపీ పాఠశాల ప్రారంభం అయింది. ఊరి చివరన అదనపు గదులను నిర్మించి పాఠశాలను అక్కడికి తరలించారు. దీంతో గ్రామం నడిబొడ్డున ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాల లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. అయితే గ్రామానికి చెందిన అన్నతమ్ములైన వైసీపీ నాయకులు పల్లే రామలింగ, పల్లే పెద్ద లింగప్ప 2020లో అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీ చేయించి ప్రాథమిక పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పాఠశాలలోకి ఎవరూ వెళ్లకుండా ప్రధాన దారికి ముళ్ల కంపలు కొట్టి బంద్ చేశారు. దీనిపై మండల అధికారులు నోటీసులు జారీ చేసినా ఆక్రమణదారుల్లో బెరుకు లేకుండా పోయింది. ఇది మాదే అంటూ అధికారులతోను, పోలీసులతోనే వాదిస్తున్నారు. సర్వే నంబరు 151లో డైక్లాట్‌లోను ఈ స్థలం గ్రామ కంఠం అని ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఆక్రమించుకున్న పాఠశాలను ఖాళీ చేసి ప్రభుత్వ అధికారులకు స్వాధీనం చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం లేదు. వచ్చే ఏడాది గ్రామానికి జడ్పీ ఉన్నత పాఠశాల వస్తోందని, సరిపడ తరగతి గదులు లేకపోతే విద్యార్థులు ఇబ్బంది పడతారని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ హెచ్‌పీ రాజు పేర్కొన్నారు. పాత స్కూల్ గదులను ఖాళీ చేస్తే మరమ్మతులు చేయించి 1 నుంచి 5 తరగతులు ఇక్కడే నిర్వహించేలా చూస్తామన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలను ఆక్రమించుకున్న వారికి ఖాళీ చేయాలని ఎన్ని సార్లు చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు. వారం కిందట కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తప్పకుండా ఖాళీ చేయిస్తాం. దీనిపై తహసీల్దార్ సునీతీబాయి మాట్లాడుతూ పాత పాఠశాల ఉన్న స్థలం మొత్తం సర్వే నంబరు 151లోని గ్రామ కంఠం అన్నారు. దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి అధికారం లేదన్నారు.

భారీగా తగ్గిన కంది దిగుబడి
అరకొర ధరలతో అన్నదాత కుదేలు

ఏ పంట పెట్టినా ఇంతేనా..!




యంత్రాలతో కందిపంట కోస్తున్న రైతులు


తగ్గుపర్తిలో యంత్రం ద్వారా గ్రేడింగ్ చేస్తున్న రైతులు

బెళుగుప్ప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ ఏడాది కంది పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మండల వ్యాప్తంగా 17,616 ఎకరాలలో ఈ ఏడాది కంది పంట సాగుచేశారు. ఎర్రనేల భూముల్లో సాగుచేసిన పంట కాస్తో కూస్తో దిగుబడి వచ్చినా, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. అననుకూల వాతావరణంలో పంటకు తెగుళ్లతో పాటు పచ్చపురుగు విపరీతంగా ఆశించింది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో మూడు దఫాలు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడితో పంట చేతికొచ్చేదని, ఈ ఏడాది ఐదు నుంచి ఆరుసార్లు పిచికారీ చేసిన దిగుబడి మాత్రం ఎకరాకు మూడు క్వింటాళ్లలోపే వచ్చింది. ప్రస్తుతం ధర కూడా తగ్గుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.తొమ్మిది వేల నుంచి పది వేలు వరకు ధర ఉండగా ఇప్పుడు రూ. ఆరు వేలకు దిగివచ్చింది. ఎకరా కంది సాగు చేయడానికి సేద్యం, విత్తనాలు, పురుగుమందులు, కోతలు, కూలీలు తదితర ఖర్చులు కలుపుకుని రూ.15 వేలకు పైగా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటబాగా పండి ఉంటే ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం మూడు క్వింటాళ్లు కూడా రాకపోవడం, ధర కూడా లేకపోవడంతో నష్టాలు తప్పని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరుతున్నారు.

ఎకరాకు రెండు క్వింటాళ్లే..



ఎంతో ఆశతో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది పంట సాగుచేయగా ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం 30 క్వింటాళ్లు అయ్యాయి. పెట్టుబడి ఎక్కువ... దిగుబడి తక్కువ రావడంతో దిక్కుతోచడం లేదు. వచ్చిన నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలో తెలియడం లేదు. **- నాగరాజు, రైతు, తగ్గుపర్తి**

నిరాశాజనకంగా దిగుబడి



వాతావరణం అనుకూలించకపోవడంతో కంది పంటలో ఆశించిన దిగుబడులు రాలేదు. పెట్టుబడి ఒక ఎకరాకు రూ. 15 వేలు పెట్టాము. దిగుబడి మాత్రం మూడు క్వింటాళ్లలోపే వస్తోంది. గిట్టుబాటు ధర కూడా లేదు. క్వింటాల్‌కు రూ. 6500లకు వ్యాపారులు అడుగుతున్నారు. గిట్టుబాటు ధర వస్తేనే రైతులు గట్టెక్కేది.
- ఎర్రిస్వామి, రైతు, ఎర్రగుడి

న్యూస్ బాక్స్

24లోపు కాంప్లెక్స్ ప్రక్రియ పూర్తి చేయండి

● డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ పునర్నిర్మాణ ప్రక్రియను ఈనెల 24లోపు పూర్తి చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీలో బ్లైండ్ స్కూల్ ఆడిటోరియంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంఈఓలతో స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... ప్రతి ఎంఈఓ తమ మండలంలోని కాంప్లెక్స్‌లు, స్కూళ్ల గురించి క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఉండాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కమిషనర్ మీటింగ్ నాటికి అన్ని అంశాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. తర్వాత డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, శ్రీనివాసులు, ఎంఈఓ జయచంద్ర63 మండలాల విద్యాశాఖాధికారులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 360 స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం కసరత్తు చేయించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు 10వ అల్ట్రామారథాన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 10వ ఎడిషన్ అల్ట్రా మారథాన్ బుధవారం బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ అధికారులు తెలిపారు. వెంకటాద్రిపల్లిలో సాయంత్రం 6గంటలకు అల్ట్రా మారథాన్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. 23న సాయంత్రం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వరకు 170కిలో మీటర్లు మారథాన్ సాగనుంది.

గురుకుల విద్యకు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఫిబ్రవరి 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్య సంస్థల్లో 5వ తరగతి చదివి ఉండాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పూర్తి ఇంగ్లీషు మీడియం ఉంటుందని వివరించారు.

టెక్నాలజీతో సైబర్ నేరాలను నియంత్రిస్తాం

● జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ప్రతిపాదన

● డీజీపీ ద్వారకా తిరుమలరావు



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న డీజీపీ

పుట్టపర్తి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిరకాల నేరాల నియంత్రణకు శాయశక్తులా కృషిచేస్తున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిముషి, ఎస్పీ వి.రత్నతో కలసి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని అన్నారు. సైబర్ నేరాలు కొంత పెరిగాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీని గంజాయిరహిత రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, అది ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని డీజీపీ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 2024 క్రైం వార్షిక నివేదికపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. నేరాల అదుపునకు చర్యలు తీసుకున్న ఎస్పీని, పోలీసు సిబ్బందిని అభినందించారు. సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన గ్యాంగ్ రేప్, మడకశిరలో బాలుడి హత్య కేసును 26 సంవత్సరాల తర్వాత ఛేదించడం, శాంతిభద్రతలు నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుశాఖ పురోగతి సాధించిందని డీజీపీ ప్రశంసించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు ఆర్ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహా సమాధిని మంగళవారం దర్శించుకున్నారు. బెంగుళూరు నుంచి రోడ్డుమార్గాన పుట్టపర్తి పోలీసుగెస్టుహౌస్ చేరుకున్న ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ షిముషి, ఎస్పీ రత్న పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు ఆయనకు స్వాగతం పలికాయి. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, డీఐజీ, ఎస్పీతో కలిసి ఆయన మహా సమాధిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

ఉద్యోగులకు

ఎండీ ద్వారకా తిరుమలరావు పిలుపు

పుట్టపర్తిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్టీసీ ఉద్యోగి అంకిత భావంతో పనిచేసి సంస్థ ఆదాయం పెంచాలని ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. సత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పుట్టపర్తికి ఆయన విచ్చేశారు. ఆయన ఆర్టీసీ డిపోను సందర్శించి ఉద్యోగులు, కార్మికులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులు, కార్మికులు ప్రైవేటు బస్సుల సేవలకు దీటుగా ప్రయాణికులకు సేవలందించి సంస్థ ఆదాయం పెంచానికి కృషిచేయాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఈనెలాఖరులోపు చెల్లిస్తామన్నారు. సంక్రాంతి పండుగ రద్దీని పురస్కరించుకుని ఆర్టీసీ చరిత్రలోనే ఈనెల 20వతేదీన రూ.23కోట్ల 71వేలు ఆదాయం ఆర్జించిందన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఐజీ షిముషి, ఎస్పీ రత్న, ఆర్ఎం మధుసూదన్, డీఎం ఇనయతుల్లా పాల్గొన్నారు.

పరిటాల రవీంద్ర వర్ధంతికి ఏర్పాట్లు

దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి మండలంలోని వెంకటాపురంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ మంగళవారం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిటాల రవీంద్ర మరణించి 20 ఏళ్లు గడిచిన క్రమంలో ఈ సారి వర్ధంతి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు, నాలుగు రోజుల నుంచి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి పరిటాల రవీంద్ర అభిమానులు వేలాదిగా తరలివచ్చేందుకు సిద్ధమవు తుండటంతో, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేపట్టారు. మరో వైపు పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద కూడా అలంకరణలు చేస్తున్నారు. ముఖ్యంగా అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నారు.

ఇష్టం లేకుంటే సెలవులో వెళ్లండి

సచివాలయ ఉద్యోగులపై మంత్రి సవిత ఆగ్రహం



సమస్యలను ఆలకిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులో వెళ్లండి.. సచివాలయ ఉద్యోగులు ఏ మండలంలోనూ లేని విధంగా ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు..' అంటూ బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గోరంట్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంగా సచివాలయ సిబ్బంది వ్యవహరిస్తున్నట్లు మంత్రి మండిపడ్డారు. పనిచేయడం ఇష్టంలేకపోతేసెలవు పెట్టి వెళ్లిపోవాలన్నారు. ఎక్కడ చూసినా పారిశుధ్య పనులు అలాగే ఉన్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులకులేదా అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న తప్పులు సమావేశంలో చెప్పడం సరికాదు, విడిగా తెలియచేస్తానన్నారు. నెలరోజుల తరువాత మళ్లీ సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటికి అధికారుల పనితీరులో మార్పు రాకపోతే పంచాయతీల వారీగా సమీక్షిస్తామని, అప్పుడు బాధపడాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, అగ్రికల్చర్ ఏడీ అల్తాఫ్‌అలీఖాన్, ఏఓ మునిక్రిష్ణ, సీఐ శేఖర్, ఏఈలు గణేష్, మోహన్, వరప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

సౌత్ వెస్ట్రన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు ఎంపీ అంబికా వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పలు రకాల రైల్వే సమస్యలను పరిష్కరించాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే జనరల్ మేనేజర్ అరవింద శ్రీవాత్సవను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం బెంగళూరులోని సౌత్ వెస్ట్రన్ రైల్వే కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. టాటా నగర్ - యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్- వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ - జైపూర్, తిరుపతి - దొడ్డనహళ్లి రైళ్లను రాయదుర్గంలో నిలపాలని కోరారు. ధర్మవరం- మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను రాయలచెరువులో నిలపాలన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురంలో నిలపాలన్నారు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురం, అనంతపురం, పెనుకొండ ప్రాంతాల్లో నిలపాలని కోరారు. ధర్మవరం- మచిలీ పట్నం ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురం వరకు కొనసాగించాలన్నారు. అనంతపురం, హిందూపురం రైల్వే స్టేషన్లల్లో హైడ్రాంట్ వాటర్ కోచ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రైల్వేకి, ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణికులకు ఫస్ట్ ఎయిడ్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు.

క్రైం న్యూస్

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు

అనంతపురం క్రైం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షేక్ షెక్షావలి అలియాస్ అంగడి వలికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించింది. ఈ మేరకు పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన షెక్షావలి స్థానికంగా అంగడి పెట్టుకుని వ్యాపారం చేసేవాడు. 2020 జనవరి 16న ఏడేళ్ల బాలిక చాక్లెట్ కొనుక్కోవడానికి ఆ అంగడికి వెళ్లింది. బాలికకు మాయమాటలు చెప్పిన ముద్దాయి తన అంగడి లోపలికి పిలిచి, ఒడిలో కూర్చోబెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక భయపడి గట్టిగా అరచి, పరిగెత్తుకెళ్లి తల్లికి చెప్పింది. ఏం జరిగిందో తెలుసుకున్న తల్లిదండ్రులు గుంతకల్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఖాసీం సాబ్ కేసు దర్యాప్తు చేసి పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో 14మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో షెక్షావలికి శిక్ష విధించారు. స్పెషల్ పీపీ ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన కోర్టు మానిటరింగ్ సిస్టం వెంకటేష్‌నాయక్, గుంతకల్లు టూటౌన్ సీఐ మస్తాన్, కోర్టు లైజర్ ఆఫీసర్, ఏఎస్ఐ శ్రీనివాసులు కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసులు, నాగార్జున, ఊదానాయక్‌లను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

అశ్రునయనాల మధ్య బేడీకి అంతిమ వీడ్కోలు



నరేంద్రసింగ్‌బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమకారుడు, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకుడు నరేంద్రసింగ్ బేడీకి మంగళవారం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. గుట్టూరు సమీపంలోని ఆయన ఫామ్‌హౌస్‌లో వయోభారంతో సోమవారం మృతి చెందారు. మంగళవారం ఆయన పార్థివదేహానికి రాజకీయ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వేలాది మంది ప్రజలు హాజరై అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన అంతిమ యాత్రలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ఆర్డీటీ ప్రతినిధి అన్నాఫెర్రర్, ఎస్ఎస్‌టీ ప్రతినిధి కంజిలాల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బబ్లూ గంగూలీ, డీపీ బలరాం, కిష్టప్ప, మేరి, రాణి, వాసు, ఉత్తప్ప, రామాంజనేయులు, రాయలసీమ జిల్లాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కొల్‌కతా నుంచి వేలాది మంది ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతిలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

అణగారిన వర్గాల కోసం బేడీ కృషి : మంత్రి సవిత

పెనుకొండ రూరల్ : రాయలసీమలోని అణగారిన వర్గాల పేద ప్రజల కోసం నరేంద్రసింగ్ బేడీ నిరంతరం కృషిచేశారని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బేడీ మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి మంగళవారం గుట్టూరు సమీపంలోని యంగ్‌ఇండియా ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరుకుని నరేంద్రసింగ్ బేడీ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రజల హక్కులు కాపాడి, సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని, ఆస్తిని ధారపోసి త్యాగం చేసిన వ్యక్తి నరేంద్రసింగ్‌బేడీ కొనియాడారు. ఆమె వెంట టీడీపీ నాయకులు సూర్యనారాయణ, నాగరాజు ఉన్నారు.

24న జాబ్ మేళా

కదిరిఅర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.20వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. ఎంపికైనవారు అనంతపురం, కదిరి, బెంగళూరు, పెనుకొండలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు బయోడేటాతోపాటు, ఆధార్, విద్యార్హతల పత్రాలు తీసుకుని ఉదయం 9 గంటలకు కళాశాల వద్దకు రావాలన్నారు. 9390176421కు ఫోన్‌చేసి, పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

బెల్ కంపెనీ అధికారితో ఎంపీ భేటీ



బెల్ కంపెనీ అధికారితో చర్చిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

గోరంట్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బెంగుళూరులోని బెల్ కంపెనీ ప్రధాన కార్యాలయంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కంపెనీ ఛైర్మన్, హెచ్‌ఆర్ డైరెక్టర్ విక్రమన్‌తో మంగళవారం భేటీ అయినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర రక్షణ మంత్రి మనోహర్‌పారేకర్ గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద బెల్ కంపెనీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పార్లమెంటు పరిధిలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కంపెనీ అధికారి సానుకూలంగా స్పందిస్తూ, అభివృద్ధి పనుల గురించి వివరించారన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన రోషిణి

గుంతకల్లుటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిల్లు కాలనీలో నివాసముంటున్న విద్యార్థిని రోషిణి(19) కడుపునొప్పి తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు షేక్షావలి, నూర్జహాన్ దంపతుల కుమార్తె రోషిణి పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతుండేది. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. పలుచోట్ల వైద్యం చేయించినా నయం కాలేదు. ఈక్రమంలోనే మంగళవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. బ్యాంకు పనిమీద బయటికి వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు ఇంట్లోకి వెళ్లగా ఉరికి వేళాడుతూ రోషిణి కనిపించింది. దీంతో వారు ఆమెను కిందకు దింపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి... పోలీసులకు అప్పగింత



పట్టుబడిన దొంగ

ఓబుళదేవరచెరువు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న మధ్యాహ్నం కదిరి, హిందూపురం ప్రధాన రహదారి ఓడీసీ బాబా ఆలయం వెనుకవైపు ఉన్న ఆర్‌ఆర్ ఫ్యాన్సీలో గుర్తు తెలియని దుండగుడు షాపులలోని క్యాష్ డ్రా బీమ్‌ను తొలగించి అందులో ఉన్న రూ.24వేలు నగదును తీసుకుని ఉడాయించాడు. దీనిని షాపు నిర్వాహకుడు హుస్సేన్‌బాషా సీసీ కేమెరాలో గుర్తించారు. చోరీకి పాల్పడిన దొంగ మంగళవారం మండల కేంద్రంలో సంచరిస్తుండగా గుర్తించిన షాపు నిర్వాహకులు, గ్రామస్థులు పట్టుకుని, దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆ దొంగ తన పేరు శ్రీరామప్ప అని, తమది హిందూపురం వద్ద ఉన్న శిరిపురమని చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. షాపు నిర్వాహకుడు హుస్సేన్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోడ్లకు మోక్షం ఎప్పుడో..?



లోలూరు క్రాస్ నుంచి ఆకులేడు వరకు గుంతలు పడిన రోడ్డు

శింగనమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా పలు గ్రామీణ రోడ్లకు నేటికీ మోక్షం లేకుండా పోతోంది.. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయాలనే కూటమి ప్రభుత్వం ఆశయానికి గత పాలన చర్యలు గండి కొడుతున్నాయి. ఫలితంగా సంక్రాంతి ముగినప్పటికీ ఈ రోడ్లకు మోక్షం లేకుండా పోయింది. మండలంలోని శింగనమల రోడ్డు నుంచి గోవిందరాయునిపేట వెళ్లే రోడ్డుకు వైసీపీ పాలనలో కంకర వేసి అర్ధంతరంగా నిలిపివేశారు. గత మూడేళ్లగా అదే పరిస్థితి ఉంది. అలాగే లోలూరు క్రాస్ నుంచి ఆకులేడు, మదిరేపల్లికి వెళ్లే ఏడు కిలో మీటర్ల రోడ్డులో అడుగడుగున గుంతలే. అలాగే కల్లుమడి నుంచి గుమ్మేపల్లి వరకు రోడ్డు మరీ దారుణంగా ఉంది. గోవిందురాయునిపేట నుంచి ఈస్టు నరసాపురం రోడ్డు, కల్లూరు నుంచి తరిమెల వెళ్లు రోడ్లపై ప్రయాణ చేయా లంటే ప్రయాణికులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో అర్ధంతంగా నిలిసిపోయిన రోడ్ల పనులతో పాటు మరి కొన్ని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన గోవిందరాయునిపేట రోడ్డు

న్యూస్ బాక్స్

నగరపాలికలో టెండర్లకు పోటీ

● రూ.5.50కోట్లతో 22 పనులకు ముగిసిన గడువు

అనంతపురం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ఈ సారి టెండర్లకు పోటీ పడ్డారు. అనంతపురం నగరపాలికలో ఈనెల 7వతేదీ రూ.5.50కోట్ల జనరల్ ఫండ్ నిధులతో 21 పనులకు టెండర్లు పిలిచారు. వాటికి గడువు సోమవారం ముగిసింది. సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నారు. వీటిలో పాతూరు పరిధిలో డ్రెయిన్, సీసీ రోడ్డుకు సంబంధించి మూడు పనులకు కేవలం ఒక్క టెండరు పడింది. అక్కడ రోడ్లు ఇరుకుగా ఉండటంతో ఆసక్తి చూపలేదని తెలిసింది. ఇక మిగిలిన అన్ని పనులకు కనీసం 2 నుంచి ఐదు వరకు టెండర్లు వేశారు. రెండింటికి ఏకంగా ఆరు, ఏడుగురు పోటీ పడ్డారు. కాగా త్వరలో కాంట్రాక్టర్లకు చెక్కులిస్తారనే ప్రచారం నేపథ్యంలోనే కాంట్రాక్టర్లు ఆసక్తి చూపినట్లు సమాచారం.

చెత్తతో వర్మికంపోస్ట్ తయారు చేయండి

గార్లదిన్నె, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చెత్తతో వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ యోగానం దరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సిరివరం, యర్రగుం ట్ల, ముకుందాపురం సచివాలయాలను మంగళవారం సందర్శించారు. సిబ్బంది బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అనంతరం చెంత నుంచి సంపద తయారి కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ యోగానందరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ మండల కోఆర్డినేటర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శిలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు సబ్సిడీ రుణాలు

● నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

శింగనమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు సబ్సిడీ రుణాలు ఇచ్చిన ఘనత టీడీపీ పాలనకే దక్కుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. ఆదినారాయణ అన్నారు. శింగనమలలోని నాయీ బ్రాహ్మ ణ కమ్యూనిటీ భవనంలో డైరెక్టర్ ఎం.ఆదినారాయణను సోమందేపల్లి మండలం నాయీ బ్రాహ్మణులు సన్మానం చేశారు. ఈసందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో బీసీ సబ్సిడీ రుణాలు ఇవ్వకపోగా పూర్తిగా రద్దు చేసిన ఘనత జగన్ పార్టీకే చెందుతుందన్నారు. బీసీల అభివృద్ధి ధ్యేయంగా టీడీపీ మరలా బీసీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల సురేష్, సోమందేపల్లి నాయకులు మనోహర్, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, మనోజ్, సంజీవరాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా జీవించాలి

అనంతపురం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనందరం ఐక్యతతో కలసిమెలసి ఉండాలని నిజామాబాద్ జిల్లా నిర్మల్ నిస్సి మినిస్ట్రీస్ పాస్టర్ జయరాజు అన్నారు. మంగళవారం మండలంలోని రాచానపల్లిలోని యేసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 55వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పాస్టర్ జయరాజు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం సామాజిక వేత్త అసోసియేషన్ గౌరవ సలహాదారులు చల్లా కిషోర్ చౌదరి, అసోసియేషన్ సభ్యులు మార్క్, మనష్షే, జీవన్‌బాబు, రూఫస్‌కుమార్, జహంగీర్ జాషువ, లాబాన్ సుధాకర్ పాల్గొన్నారు.

అనంత వాసులకు 'తెలుగుకీర్తి' అవార్డులు





తెలుగుకీర్తి అవార్డులు అందుకుంటున్న డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, సుంకర రమేష్

అనంతపురం కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఇద్దరు సాహితీవేత్తలకు 'తెలుగుకీర్తి' అవార్డులు అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహితీ రంగానికి చెందిన పలువురికి మంగళవారం విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జిల్లా తరఫున సీనియర్ సాహితీవేత్త డాక్టర్ పతికి రమేష్ నారాయణ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్‌కు శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా అవార్డులను అందజేసి సత్కరించారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

గార్లదిన్నె/అనంతపురం న్యూటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం నారయణ (70) అనే వ్యక్తి రైలు పట్టాలు దాటుతూ రైలు కిందపడి మృతి చెం దాడు. గార్లదిన్నెకు చెందిన బోయ నారాయణ గార్లదిన్నె రైల్వే స్టేషన్ సమీపంలో నడుచుకుంటూ రైల్వే ట్రాక్ దాటుతున్నాడు. అయితే వృద్ధుడు కావడంతో సరిగా వినపడక పోగా స్పీడ్‌తో వచ్చిన గూడ్స్ రైలు గుద్దేయడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రైల్వే ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం అనంత పురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

నలుగురు స్మార్ట్ ఫోన్ దొంగల అరెస్టు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేసే ముగ్గురు యువకులు సహా బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. అలాగే డోన్ పట్టణం శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి (37) హైదరాబాద్‌లో కీసరలో కూలీ పనులు చేస్తుంటాడు. ఇక అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బీ కాలనీకి చెందిన సాయిశివ(29) ప్రైవేటు పనులు చేస్తుండేవాడు. ఈ ముగ్గురు కలిసి ఈజీమనీ కోసం స్మార్ట్‌ఫోన్లను చోరీ చేస్తూండేవారు. వీరికి హైదరాబాద్ నగరం ఎల్‌బీనగర్‌కు చెందిన బాలుడు(12) తోడయ్యాడు. ఈక్రమంలో శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో పట్టణ శివార్లలోని నంది కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన ఓ కారు వేగంగా వెళ్లిపోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. కారులోని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో అంతర్రాష్ట్ర స్మార్ట్‌ఫోన్ దొంగలుగా వారిని గుర్తించారు. వారి నుంచి 50 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని బొస్టేర్ స్కూల్‌కు తరలించారు. డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముగ్గురు యువకుల అరెస్టు చూపారు.

జగన్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు

● స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు చంద్రబాబు బ్రేక్

● ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడుయాదవ్



మీడియాతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లల్లో తన కేసులు కొట్టివేయించుకు నేందుకు జగన్ రాష్ట్రాన్ని తాక ట్టు పెట్టా ర ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ పట్నాన్ని రాజధాని చే స్తానంటూ జగన్ ఆ ప్రాంతాన్ని సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. తన కేసులను మాఫీ చేయించుకునేందుకు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమయ్యాడని దుయ్యబట్టారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత ఆర్నెల్లలోపే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు బ్రేక్ వేశారన్నారు. ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షాతో మాట్లాడి ప్రైవేటీకరణ ఆపడంతో పాటు రూ.11,440 కోట్లు ప్యాకేజీని తీసుకొచ్చారని అన్నారు. వెంటకశివుడు యాదవ్ మాట్లాడుతూ... గతంలో తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కల్పించాలని, అవసరమైతే రాష్ట్రాన్ని తాకట్టుపెడతానని జగన్ ఢిల్లీ చుట్టూ తిరిగేవాడన్నారు. సీఎం చంద్రబాబు అందుకు భిన్నంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతి సారీ ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, జిల్లా ప్రచార కార్యదర్శి కూచి హరి పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పారిశ్రామిక వేత్త ఉండాలన్నదే సీఎం లక్ష్యం

● ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటా ఒక పారిశ్రామిక వేత్త ఉండాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక 28వ డివిజన్‌లోని అశోక్ నగర్‌లో మంగళవారంమీ ఇంటికి - మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి స్థానిక ప్రజలతో సమస్యలపై ఆరా తీశారు. త్వరలో ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఇంట్లో చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు వారే ఒక పారిశ్రామిక వేత్తగా మారే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. త్వరలోనే వాటి ఫలాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ విష్ణు మూర్తి, టీడీపా నాయకులు గంగారామ్, రాయల్ మురళి, సరిపూటి రమణ, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వరన్, కడియాల కొండన్న, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నార్పల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పనిచేయాని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును ఎమ్మెల్యే ఎండ గట్టారు. గత ప్రభుత్వంలో అధికారులు స్తబ్ధతతో పనిచేశారని, ప్రస్తుతం కూటమి పాలనలో స్తబ్ధత, నిర్లక్ష్యం వీడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హెచ్చరించారు. ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు పక్క గృహాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత పాలనలో కబ్జాలు, దురాగతాలు ఎన్నో జరిగాయని ఇప్పుటి వాటి చోటు లేదని తెలిపారు. గతంలో జగనన్న కాలనీల్లో అనేక అక్రమాలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి అక్రమాల నిగ్గు తేల్చాలని చెప్పానని ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల సర్వత పరిష్కారం కోసం కృషి చేయాలని, లేకుంటే తగిన చర్యలు తప్పవన్నారు. నార్పలను కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించి, సాగునీరు ఇస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, తహసీల్దారు అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత నెల 30 నుంచి కొనసాగుతోన్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య(పీఎంటీ, పీఈటీ)పరీక్షలు మంగళవారం ముగిశాయి. వివిధ కారణాలతో గైర్హాజరైన అభ్యర్థులకు, ఎత్తు, ఛాతీ కొలతలు, తదితర అంశాలలో అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు ముగింపు రోజున అవకాశమిచ్చారు. స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో వారికి సంబంధిత అంశాలపై పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రారంభం నుంచి యావత్తు ప్రక్రియను పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవల్ రిక్రూట్మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్ఆర్‌బీ)నిబంధనల మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

జగన్‌ది స్వార్థం... చంద్రబాబుది ప్రజా సేవ

● ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న పరిటాల సునీత

రామగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను 2002లో ఆర్థిక నష్టాల్లో నుంచి కాపాడింది, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.... విశాఖఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా ఆపడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జగన్ తన కేసుల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకు వెనుకాడలేదన్నారు. విశా ఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణకు అన్నివిధాలుగా సహరించేందుకు ఆయన అప్పట్లో సిద్ధమయ్యారన్నారు. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీ కరణ కాకుండా అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశారన్నారు. ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడేందుకు రూ.11, 440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని సాధించారన్నారు. నిన్నటి వరకు విశాఖ స్టీల్ ప్లాంటుపై దుష్ప్రచారంచేసిన వైసీపీ నాయకులు దీనికి ఏమి సమాధానంచెబుతారని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్రానికి కూడా కొత్త పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని, ఇదంతా సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ వల్లే సాధ్యమవుతోందన్నారు.

పరిటాల రవీంద్ర వర్ధంతికి తరలిరండి

● టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతికి భారీగా తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 24 పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా రామగిరి మండలం వెంకటపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు.

● ఆత్మకూరు: రామగిరి మండలం వెంకటాపురంలో ఈ నెల 24న జరిగే పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● చెన్నేకొత్తపల్లి : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతికి భారీగా తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పేర్కొన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన వెంకటాపురంలో పరిటాల రవీంద్ర వర్ధంతిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, వడ్డె దుర్గా, హరినాథరెడ్డి, ఏపీ శ్రీనివాసులు, చెన్నకేశవులగౌడ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అభివృద్ధికి సహకరించాలి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన



టీసీ వరుణ్, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం అభివృద్ధికి అహుడా ద్వారా సంపూర్ణ సహకారం అందించాలని అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించారు. హిందూపురం వచ్చిన బాలకృష్ణను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీసీ వరుణ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం వారు స్థానిక మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ... హిందూపురం అభివృద్ధిలో అహుడా క్రియాశీలక భూమికి పోషించాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఇందుకు టీసీ వరుణ్ స్పందిస్తూ... అహుడా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని చెప్పినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిన వారిలో జనసేన హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమేష్, నాయకులు ఈశ్వరయ్య, నాగేంద్ర, సంజీవరాయుడు, ధనుంజయ, రమణ, చంద్రశేఖర్, చక్రవర్తి, ప్రవీణ్, లోకేశ్, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

కథనాలతో ప్రభుత్వాన్ని కదిలించిన పాత్రికేయుడు





తేజ ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న పాత్రికేయులు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

తేజ ప్రసాద్ సంస్మరణ సభలో వక్తలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తన వార్తల ద్వారా కరువును కళ్లకు కట్టినట్లు చూపిన పాత్రికేయుడు తేజ ప్రసాద్ అని పలువురు వక్తలు కొనియాడారు. తన కథనాలతో ప్రభుత్వాలను కదలించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో తేజ ప్రసాద్ సంస్మరణ సభను నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు ఆజాద్ అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తేజ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జిల్లాలో సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారం కోసం తేజప్రసాద్ క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. తన వార్త కథనాల తో ప్రభుత్వాలను కదలించి సమస్యలకు పరిష్కారం చూపిన కార్యసాధకు డన్నారు. నేటికి జిల్లాలో నీటి పారుదల, వ్యవసాయరంగం సమస్యల నడుమే ఉన్నాయన్నారు. నేటితరం పాత్రికేయులు తేజ ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకొని సాగు, తాగునీరు, వ్యవసాయరంగ సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన తన జీవితం మొత్తం మీడియా రంగానికే పరిమితం చేశారన్నారు. మీడియా రంగంలో ఆయన సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయన్నారు. సభలో జర్నలిస్టు సంఘాల నాయకులు తలారి రామాంజనేయులు, మచ్చా రామలింగారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రేపటి రామాంజనేయులు, చల్లా కె.నాయుడు, షఫి, రవిచంద్ర, సుధాకర్, మార్కండేయులు, రామకృష్ణ, శివారెడ్డి, పలువురు ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల పంపిణీని వేగవంతం చేయండి

● ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీని వేగవంతం చేయాలని ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన మంగళవారం గుంటూరు నుంచి ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లుతో కలిసి పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఏపీఎంఐపీ అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు నాన్ సబ్సిడీ డబ్బులు కట్టేలా చూడాలన్నారు. కలెక్టర్ నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చిన ప్రతి ఒక్కరికి సకాలంలో పరికరాలు అందజేసి పొలాల్లో బిగించాలని సూచించారు.

సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి రావాలి

● అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు

అనంతపురం న్యూటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాలను అన్నీ వినియోగంలోకి రావాలని పంచాయతీ రాజ్ అడిషినల్ కమిషనర్ సుదాకర్‌రావు సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం టెలీకాన్ఫెరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. ఒక మంచి ఆలోచనతో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవి పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తేనే వాటి ఫలితాలు కనిపిస్తాయన్నారు. అందుకు అనుగుణంగా గ్రామ పంచాయతీ స్థాయిలో కార్యదర్శులు చర్యలు చేపట్టాల,ఇ ప్రధానంగా డీఎల్‌పీఓలు శ్రద్ధ చూపాలని సూచించారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, నాయకులు

గార్లదిన్నె, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామంలో మంగళవారం పెద్దమ్మ దేవత జాతర ఘనంగా జరిగింది. గ్రామంలోని తొగట వీరక్షత్రియులు సోమవారం రాత్రి చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, రామలింగారెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, గేటు క్రిష్టారెడ్డి, సర్పంచు లక్ష్మి, ఎర్రి స్వామి, సుబ్బు తదితర నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గ్రామం భక్తులతో కిటకిటలాడింది. శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

మరూరులో ఊరి దేవర



మరూరులో జాతరకు తరలివచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్,ఎంపీ బీకే పార్థసారథి





రాప్తాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరులో మంగళవారంపెద్దమ్మ ఊరి దేవర అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఏన్నో ఏళ్ల తర్వాత నిర్వహిస్తుండడంతో జిల్లా నలు మూలల నుంచి భక్తులు హాజరయ్యారు. సోమవారం రాత్రి పెద్దమ్మ, పోతులయ్య స్వామికి దున్నపోతును బలి ఇచ్చారు. పొట్టేళ్లను అధిక సంఖ్యలో బలి ఇచ్చారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రామం జనసంద్రంగా మారింది. రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాప్తాడు సీఐ శ్రీ హర్ష, రాప్తాడు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తదితరులు హాజరయ్యారు. గ్రామస్థులు వారికి ఘనస్వాగతం పలికారు.

ప్రతి గ్రామంలో సురక్షిత నీరు అందిస్తాం

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని మరూరులో టీడీపీ సీనియర్ నాయకుడు మరూరు గోపాల్ తన సొంత నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మరూరులో జాతరకు హాజరైన వైకుంఠం ప్రభాకర్ చౌదరి

కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, దీనిపై జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత ఖరీఫ్‌లో సాగుచేసిన పంటను సకాలంలో అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే మార్కెట్‌లో తక్కువగా ఉండటం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. దళారుల చేతిలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా రూ.7550కు అదనంగా రూ.2వేలు కలిపి అందజేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈనెల 25వ తేదీలోగా స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌లో కందులు పోసి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

ఘనంగా ఊరిదేవర


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొమ్మనహాళ్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామదేవత దేవమ్మదేవి ఊరిదేవర ఉత్సవ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వంద ఏళ్లకుపైగా నిర్వహించిన తరువాత జరుగుతున్న దేవర ఉత్సవాలు కావడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఉదయం గంగాజలం తెచ్చి అమ్మవారిని అభిషేకించి విశేష పూజలు చేయించారు. అర్ధరాత్రి కుంభాల మహోత్సవం నిర్వహించనున్నారు.

మారెమ్మదేవికి పూజలు: మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామ శివారులో వెలసిన మారెమ్మదేవికి మంగళవారం విశేషపూజలు జరిగాయి. పుష్యమాసం నాలుగో మంగళవారం సందర్భంగా తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు అమ్మవారికి పూజలు చేయించారు. ఉదయం గంగాజలం తెచ్చి అమ్మవారికి అభిషేకించారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి, కేశవరెడ్డి, సల్లాపురం బాబు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో దేవమ్మదేవి ఆలయం

విడపనకల్లు: మండలంలోని మాళాపురం గ్రామంలో దేవమ్మదేవి దేవర మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి నిర్వహించిన దేవర కార్యక్రమంలో గ్రామస్థులు అమ్మవారికి పూజలు చేశారు. సోమవారం అర్ధరాత్రి గ్రామ దేవరలో బోనాలు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బలిహరణ చేశారు. మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి బోనాలు (కుంభాలు) ఊరేగింపు చేసి పొట్టేళ్లను బలిచ్చారు.

కూడేరు: మండలంలోని కడదరకుంట గ్రామంలో ఊరిదేవర ఘనంగా జరిగింది. మంగళవారం గ్రామంలో పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి బోనాలను సమర్పించారు.


అలంకరణలో పెద్దమ్మతల్లి

పెద్దవడుగూరు: మండలంలోని కోనాపురం గ్రామంలో మంగళవారం పెద్దమ్మ జాతర సందర్భంగా ప్రజలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


జ్యోతులతో వస్తున్న భక్తులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో దేవర అనంతరం మంగళవారం తెల్లవారుజామున జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం జ్యోతులు ఎత్తుకొని నృత్యంచేస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు.

నవజ్యోతుల మహోత్సవం


పురవీధులలో చౌడేశ్వరీదేవి నవజ్యోతుల శోభాయాత్ర

రాయదుర్గం టౌన్: పట్టణంలోని చౌడేశ్వరిదేవి నవజ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొగుటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి, చిత్రదుర్గం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూర్ణకుంభాలు, నవజ్యోతులు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఫాదర్ ఫెర్రర్ ఆలయ సందర్శన

కుందుర్పి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ దేవాలయాన్ని మంగళవారం స్పానిష్ మిత్ర బృందం సందర్శించింది. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ వైటీ ఓబయ్య, కుందుర్పి ఏరియా టీమ్ లీడర్ సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఎన్ రాజగోపాల్ బృందానికి స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మెంబర్ నీరుగంటి శ్రీరాములు, ఎన్ మల్లికార్జున, ఎన్ శివమూర్తి, నాగరాజు, అంజినప్ప, కే జయమ్మ, వైటీ పుట్టీరమ్మ, దుర్గమ్మ, మహాదేవి, కుందుర్పమ్మ, నవీన్ కుమార్, బాలరాజు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

యల్లనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల అలసత్వంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12గంటలు కావస్తున్నా కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో సభ్యులు మా కన్నా ముందే హాజరు కావాల్సిన అధికారులు ఎందుకు రాలేదని ఎంపీడీఓను జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు కోరారు. అనంతరం అధికారులు తమతమశాఖల పరిధిలో జరుగుతున్న పనులపై సభలో వివరించారు. తీర్మానాలు లేకుండా పనులు జరుగుతున్నాయని, కొన్ని పంచాయతీల్లో సర్పంచులకు తెలియకుండానే పనులు చేయిస్తున్నారని, అలాంటప్పుడు సర్పంచులు ఎందుకు దండగ అంటూ చిలమకూరు సర్పంచు నాగరాజు సభ దృష్టికి తీసుకువచ్చారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

రాయదుర్గం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు మీదకు వచ్చినపుడు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణ సమీపంలో ఆర్టీఓ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

శాంతియుత జీవనాన్ని కొనసాగించాలి

రాయదుర్గం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో శాంతియుతంగా జీవనాన్ని గడపాలని అర్బన్ సీఐ జయనాయక్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని చదం గ్రామ ఎస్సీ కాలనీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన


వీరాపురంలో పర్యటిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి, తేరన్నపల్లి, ఎగువపల్లి, దిగువపల్లి, బొందలదిన్నె గ్రామాలతోపాటు ఫ్యాక్షన్ గ్రామమైన వీరాపురంలో ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి ఇంకా ఏమైనా ఉన్నాయా అని అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామం అంతా పర్యటించి తాడిపత్రి ప్రాంతానికి ఎక్కడ నుంచి హద్దులు ఉన్నాయని బార్డర్ వరకు వెళ్లి పరిశీలించారు. ఇక్కడున్న పరిస్థితులపై సీఐ శివగంగాధర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర అంశాలపై ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కేసులు, పెండింగ్ ఫైల్స్ పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ ధరణీబాబు, సిబ్బంది ఉన్నారు.

రక్తదాన శిబిరానికి కదలిరండి

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మంత్రి నారాలోకేశ్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరానికి నియోజకవర్గంలోని ప్రజలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కదలిరావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, మండల కన్వీనర్ గోళ్లవెంకటేశులతో కలిసి ఎమ్మెల్యే పట్టణంలోని ప్రజావేదిక వద్ద మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 23వ తేదీన మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా ప్రజావేదిక వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ఇక్కడే చేపట్టే రక్తదాన శిబిరాన్ని గుర్తించేవిధంగా ఉండాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న లిఖిత తల్లిదండ్రులకు సీఎం సహాయ నిధి కింద రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే సురేంద్రబాబు అందచేశారు. టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం ఈ సహాయ నిధి చెక్కును అందచేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే: మండలంలోని మల్లిపల్లిలో చౌడేశ్వరి జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే సురేంద్రబాబు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్థులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దౌర్జన్యంగా పనులు చేయడం ఏంటి?

● ఫ్లైఓవర్ పనులను అడ్డుకున్న గ్రామస్థులు


అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం

డి.హీరేహాళ్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఫ్లైవోర్ పనులు దౌర్జన్యంగా చేయడమేంటని మండల కేంద్రంలోని ప్రజలు మంగళవారం అడ్డుకున్నారు. అండర్ పాస్ నిర్మాణం వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న అధికారులు, పనులు చేస్తున్న సిబ్బందితో వారు వాగ్వాదానికి దిగారు. ప్రజలు మాట్లాడుతూ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోర్టుకు విన్నవించామని, కోర్టు నుంచి ఉత్తర్వులు రాకనే దౌర్జన్యంగా పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. వీరికి ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం మీదుగా నేషనల్ హైవే వెళుతున్నందున రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకల కోసం అండర్‌పాస్ ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు సంబంధించి రెండు నెలల క్రితం ఎస్ఆర్‌సీ బిల్డర్స్ పనులు ప్రారంభించిందన్నారు. నిర్మాణ పనులు చిన్న పరిమాణంలో ఉన్నందున భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని మూడునెలల క్రితమే గ్రామస్థులు పనులను అడ్డుకొని ఆపివేయించారన్నారు. ఆంధ్ర, కర్ణాటక హైకోర్టును కూడా ఆశ్రయించారన్నారు. మంగళవారం నేషనల్ హైవే అధికారులు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వారు వాహనాల ద్వారా పనులు ప్రారంభించేందుకు పూనుకున్నారన్నారు. గ్రామస్థులతో కలిసి అక్కడికి చేరుకొని పనులను అడ్డుకునే ప్రయత్నం చేశామన్నారు. ఈ సమయంలో అక్కడ పనులు చేపట్టే సిబ్బందికి గ్రామస్థులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ మునివేలు అక్కడికి చేరుకున్నారు. అధికారులు కూడా దీనికి సంబంధించి పనులను అడ్డుకోవద్దని చెప్పగా అధికారులే ఈ కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడం సమంజసం కాదని గ్రామస్థులు తహసీల్దార్‌పై మండిపడ్డారు. కోర్టుతీర్పు వెలువడే వరకు ఎక్కడా ఎటువంటి పరిస్థితులలో పనులు చేపట్టడం కుదరదని గ్రామస్థులు తేల్చి చెప్పారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్‌నుంచి కింద పడి మంగళవారం ఇద్దరు గాయపడ్డారు. యాడికికి చెందిన మధు, రామాంజనేయులు ద్విచక్రవాహనంపై పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా తాడిపత్రి రోడ్డులోని గ్యాస్ గోదాము వద్దకు రాగానే ఆటో ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుత్తిరూరల్: మండలంలోని కొత్తపేట గ్రామాశివారు 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు. అనంతపురానికి చెందిన డ్రైవర్ రాజు కర్నూలుకు కారులో వెళ్తుండగా కొత్తపేట గ్రామాశివారులోకి రాగానే వెనుక నుంచి లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి అతనిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో నిలబడి ఉన్న నాగముని అనే వ్యక్తిని గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో గాయపడినట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. మంగళవారం నాగమునిని ఢీకొట్టి వెళ్లిపోవడంతో బైక్‌నెంబరు ఆధారంగా కేసు నమోదు చేశామని తెలిపారు. చికిత్స నిమిత్తం నాగమునిని తాడిపత్రికి తరలించామన్నారు.

పోలీసుల అదుపులో మహిళలు

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో మహిళా దుండగులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మండల పరిధిలోని మంగళకుంట, తిమ్మసముద్రం పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్నట్లు ఆయా గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ఆటోలో తరలిస్తున్న ఓ మహిళ తప్పించుకున్నట్లు తెలిసింది.

రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలను పెంచాలి

గుంతకల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాల నిఘా పెంచాల్సి ఉందని సెక్యూరిటీ ఆడిట్ బృందం అధికారులు సూచించారు. రైల్వే స్టేషన్‌లోని భద్రతా ప్రమాణాలను పరిశీలించడానికి రాష్ట్ర అధికారుల బృందం మంగళవారం ఉదయం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పర్యటించింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో సెక్యూరిటీ ఆడిట్‌ను నిర్వహిస్తారు. రైల్వే స్టేషన్ నుంచి బయటకు వెళ్లే మార్గాలు, సీసీ కెమెరాల పరిధి, రద్దీ నియంత్రణ ఏర్పాట్లు, ప్లాట్‌ఫారాలపై పోలీసు పర్యవేక్షణ, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం 1వ నంబరు ప్లాట్‌ఫారంలోని వీఐపీ లాంజ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆడిట్ అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ మేరకు రైల్వే శాఖకు సెక్యూరిటీ ఆడిట్ సభ్యులు సూచనలను పంపనున్నారు. గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డీఎస్పీ రాంబాబు, సీఐలు మనోహర్, మస్తాన్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

రాయదుర్గంటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో పక్షవాతంతో బాధపడుతూ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన జీజీహెచ్ వైద్యబృందం మంగళవారం పరిశీలించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకుమార్, ఎస్ఆర్ అరాఫత్‌తో కూడిన బృందం ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. పక్షవాతాన్ని కలిగి పింఛన్ పొందుతున్న శ్రీనివాసులు, గంగాధర, శాంతమ్మ, పద్మ, తిమ్మప్పలను వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


కిరణ్ (ఫైల్)

యల్లనూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గుపల్లి గ్రామానికి చెందిన కిరణ్ (23) అనే యువకుడు విద్యుదా ఘాతానికి గురై మంగళవారం మృతిచెంది నట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరాముడు కుమారుడు కిరణ్ సంజీవరాయుడు ఇంట్లో మంగళవారం సాయంత్రం వైరింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లకు తగిలాడు. విద్యుత్ ప్రసరించడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. వెంకటరామునికి కిరణ్ ఒక్కడే సంతానం. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

తాడిపత్రి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుట్లూరు రైల్వేగేట్ వద్ద రైలుకిందపడి విశ్వనాథరెడ్డి (63) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి గత కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండేవాడు. ఆపరేషన్‌కూడా చేయించుకునానడు. కొన్నిరోజుల క్రితం కాలు విరగడంతో ఆపరేషన్ చేయించుకున్నా సరిగా సెట్ కాలేదని మనస్థాపానికి గురై మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వనాథరెడ్డికి భార్య నాగేశ్వరమ్మ, కుమార్తె శ్యామల, కొడుకు హేమంత్‌కుమార్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడులో సోమవారం రాత్రి మల్లికార్జున, రాంమోహన్ వర్గీయులు పాతకక్షల కారణంగా ఘర్షణ పడినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. కొంతకాలంగా వీరిమధ్య పాతకక్షలు ఉన్నాయని, రాత్రి ఒకరికొకరు ఎదురుపడడంతో మల్లికార్జున, రాంమోహన్ వర్గీయులు పరస్పరం ఘర్షణపడ్డారు. ఇరువర్గాలపై కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, కళ్యాణదుర్గం రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు ఉరవకొండ నుంచి బొలెరో వాహనంలో 34 క్వింటాళ్ల బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం పావగడకు తరలిస్తున్నారన్న సమాచారం అందిందన్నారు. మండల పరిధిలోని గోళ్ల గ్రామం వద్ద వాహనాన్ని పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు నిందితులు ముత్యాలప్ప మరో ఇద్దరిని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


ఇసుక ట్రాక్టర్ల సీజ్

గుమ్మఘట్ట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వేదవతి హగరి నుంచి కర్ణాటక ప్రాంతానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు రాయదుర్గంరూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. కొంత కాలంగా బీటీపీ, తాళ్లకెరకు చెందిన ఇద్దరు వ్యక్తులు రాత్రివేళల్లో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సరిహద్దులో డంప్ చేసి కర్ణాటక బెంగళూరు టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.

వైభవంగా అంకాలమ్మ, కుంటెమ్మ జాతర


అలంకరణలో అమ్మవార్లు

పామిడి పట్టణంలోని కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ గ్రామ దేవతల 17వ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలపళ్ల విభాగానికి 17 కాండ్లు వచ్చినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఎం అక్షరరెడ్డి ఎద్దులు రాతిదూలాన్ని 4464.3 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 30వేలు సొంతం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన గ్రామానికి చెందిన లవకుమార్ శివగోవింద్ యాదవ్ చెందిన ఎద్దులు 4139 అడుగులు లాగి ద్వితీయస్థానంలో నిలిచి రూ.20 వేలు కైవసం చేసుకున్నాయి. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన మారంరెడ్డి మహేశ్వరరెడ్డి ఎద్దులు 4000 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ. 15వేలు సాధించాయి. కడప జిల్లా వెల్దుర్తి మండలం కల్లగొల్లు గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు, నంద్యాల జిల్లా డోన్ మండలం మల్లెల గ్రామానికి చెందిన షేక్ మహిమున్నాకు చెందిన ఎద్దులు 3917 అడుగులు లాగి చతుర్థ స్థానంలో నిలిచి రూ. 10వేలు సాధించాయి. ఈ జాతరకు విచ్చేసిన భక్తాదులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జాతరకు హాజరై భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తీర్థ, ప్రసాదాలు పొందారు. - ఆంధ్రజ్యోతి, పామిడి


రాతిదూలం లాగుతున్న ఎద్దులు

నెట్టికంటి ఆలయంలో మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేషపుష్పాలంకరణ చేశారు. వేదపండితులు, అర్చకులు మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయ పరిసరాల పరిశీలన: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలోని పరిసర ప్రాంతాలను అస్సిస్ ఇన్‌ఫ్రాకాన్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన చీఫ్ డిజైన్ ఇంజనీర్ అలంకొండ రామాంజినేయులు, ఆలయ ఈఓ వాణి మంగళవారం పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఆలయ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా పరిసరాలను పరిశీలించామన్నారు.

మైనార్టీల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట


టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణ

గుంతకల్లు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు టీడీపీ హయాంలోనే ప్రాధాన్యత ఉంటుందని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్ కొట్టాలకు చెందిన 30 కుటుంబాలు నారాయణ స్వామి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరాయి. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు షేక్ ఖాసీం వలి, షేక్ హుసేన్, గడార్ల ఖాజా, సయ్యద్ రజాక్ సాబ్, ఖాదర్‌బాషా, మహబూబ్ సాబ్, బాషు, రజని తదితర కుటుంబాలవారు టీడీపీలో చేరారు. నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, జనవరి21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గానుగవీధి, రాగితోటపాలెంలోని కొన్ని వార్డుల్లో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పర్యటించారు. వార్డుల్లో తిరుగుతూ అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరాతీశారు. వార్డుల్లో డ్రైనేజీ సమస్యతోపాటు కొందరు పింఛన్లు రాలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అర్హులైన వారికి పింఛన్లు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్య కూడా త్వరగా పరిష్కరిస్తామన్నారు. అక్కడే ఉన్న మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్లు విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, రంగనాథరెడ్డి, లక్ష్మీదేవి, నాయకులు రంగనాయకులు, ఖాదర్ బాషా, రామాంజనేయులు, విజ్జి, గంగరాజు, లచ్చి ఉన్నారు.